క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాత మోహన్

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంలో ఉన్న అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు మోహన్ అనే దాత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరంలా మారిందని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. సోమవారం చొక్కమడుగు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 47 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. బీపీ, షుగర్ చెక్ చేసి సూచనలు, సలహాలు అందించారు. జ్వరం, జలుబు, ఆయాసం, దగ్గు వస్తే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు.

అంటువ్యాధుల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున గ్రామీణ ప్రజలకు అంటువ్యాధులు సోకకుండా అవగాహన కల్పించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అంటువ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా చూడాలని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు జ్వరంతో బాధపడే వారిని గుర్తించి, వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు నిత్యం గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్‌ఎం, ఆశా పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మసునంద

కార్వేటినగరం: బాల్యవివాహాలపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద అన్నారు. సోమవారం సీడీపీఓ కార్యాలయంలో భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది తమ పరిధిలో మేజర్, మైనర్ బాలికల వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆధార్‌లో ఉన్న వయసు ఆధారంగా వివాహాలకు అనుమతి ఇవ్వాలని సూచించారు. కొందరు ఆస్తుల కోసం బాల్యవివాహాలు చేసి చేతులు దులుపుకుంటున్నారని, అలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వరకట్న వేధింపులపై కూడా దృష్టి సారించాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు సమావేశాలు ఏర్పాటు చేసి రక్తహీనతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిరా, శ్యామల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

- ఈ ఫోటోలో కనిపిస్తున్న మహిళ పేరు జ్ఞానేశ్వరి నగరి మండలం, ముడిపల్లిలో నివాసం ఉంటోంది. ఈమెకు చేయూత పథకంలో లబ్ధి పొందడానికి కుల ధ్రువీకరణ పత్రం అవసరం. ఇందుకోసం గతంలో చాలాసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగింది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. సురక్ష శిబిరంలో సర్టిఫికెట్ అందుకుంది.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ఎస్.కవిత. నగరి మండలం, ముడిపల్లి గ్రామం. తన కుమార్తె రేష్మకు బీటెక్ చదువు నిమిత్తం కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. అందుకు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దే సర్టిఫికెట్లు అందజేశారు. దీంతో ఆమె ఆనందానికి అవధులు లేవు.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎస్‌వీ నరేంద్ర, నగరి మండలం ముడిపల్లి నివాసి. కరస్పాండెంట్‌గా ఎంబీఏ చేస్తున్నాడు. అయితే ఇతనికి కులధ్రువీకరణ పత్రం ముఖ్యం. కాగా జగనన్న సురక్ష కార్యక్రమంలో ఒక రూపాయి ఖర్చు లేకుండా కులం, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలు పొందాడు. గతంలో వీటి కోసం కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాడు. జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల పైసా ఖర్చు లేకుండా అన్నీ చేతికి అందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



ప్రజల చెంతనే ప్రభుత్వ సేవలు

- ఇది ప్రజాసర్కార్
- సచివాలయాల ద్వారా ప్రజల ఇళ్ల ముంగిటకే సంక్షేమఫలాలు అందిస్తున్నాం
- ముడిపల్లి సచివాలయ పరిధిలో రూ.12.29 కోట్లు మేర సంక్షేమం
- జగనన్న సురక్షలో ఉచితంగా 566 మందికి సర్టిఫికెట్లు
- మంత్రి ఆర్‌కే రోజా



సర్టిఫికెట్లు అందుకున్న వారితో మంత్రి ఆర్‌కే రోజా



సమావేశానికి హాజరైన జనం

నగరి : ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రజల సర్కార్ అని ప్రజల కష్టాలు అర్థం చేసుకునే మనసున్న నాయకుడైన జగనన్న పరిపాలిస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. సోమవారం మండలంలోని ముడిపల్లిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 302 మందికి ఇంటిగ్రేటెడ్ కుల ధ్రువీకరణ పత్రాలు, 196 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇద్దరికి బియ్యం కార్డుల విభజన, 65 మందికి ఆధార్ మొబైల్ లింకింగ్, ఒకరికి పట్టాపాసుపుస్తకం అంటూ 566 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండి ధ్రువీకరణ పత్రాలు లేక, సాంకేతిక కారణాల వల్ల పథకాలకు దూరమైన వారికి జగనన్న సురక్ష ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వం ఇంటి వద్దనే సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తోందన్నారు. జనన, మరణ, కుల ఆదాయ అంటూ 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం జన్మభూమి సమావేశాలంటూ అర్జీలు మాత్రమే తీసుకుని వాటిని తీసుకెళ్లి చెత్తకుప్పల్లో పడేసేవారన్నారు. జన్మభూమి కమిటీలు చెప్పే ఒకరిద్దరికి మాత్రమే లాభం చేకూరేదన్నారు. జగనన్న సురక్షలో పదిరోజుల క్రితమే అవసరాలను గుర్తించి వాటిని సిద్ధం చేసి అవసరమైన సర్టిఫికెట్లు సమావేశం ఏర్పాటు చేసి అందజేస్తున్నామని చెప్పారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన ఉన్న ముఖ్యమంత్రికే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి పథకం ప్రజల ఇళ్ల వద్దకే చేరుతోందన్నారు. ఇది ప్రజల సర్కార్ అన్నారు. ముడిపల్లి సచివాలయ పరిధిలో నాలుగేళ్లలో 15 సంక్షేమ పథకాలకు, సీసీరోడ్డు, తాగునీటికి, పాఠశాలల ఆధునికీకరణకు, రైతుభరోసా కేంద్రం, సచివాలయం, ఇంటి పట్టాలు, ఇళ్ల నిర్మాణం అంటూ ప్రభుత్వం రూ.12.29 కోట్లు అందజేసిందన్నారు. జగనన్న లాంటి సీఎం ఉంటే ఏ రాష్ట్రమైనా సంతోషంగా ఉంటుందన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని, ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న తనను ప్రజలు మళ్లీ తప్పక ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వాసు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, ఎంఈఓ శ్రీదేవి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ ప్రకాష్, నాయకులు టి.గోవిందయ్య, చుక్కబ్బశెట్టి, కె.వెంకటేశ్వర్లు, ఎం.రామ్మూర్తి, ఆర్.పురుషోత్తం, డి.శంకర్, కె.షణ్ముగం, ఎం.చంద్ర, డి.సుధాకర్, ఎస్.గుణశేఖర్, సి.చంద్రశేఖర్ నాయుడు, ఖాదర్‌బాషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై దాడులు అరికట్టండి



జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చాంద్‌బాషా

పుత్తూరు రూరల్: విధి నిర్వహణలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ సోమవారం తిరుపతిలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డికి డెమోక్రటిక్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఆధిపత్య పోరులో సచివాలయ ఉద్యోగులను బలి పశువులను చేస్తున్నారని ఆరోపించారు. తమపై భౌతికదాడులు సైతం జరిగాయని, వీటిపై పోలీస్‌స్టేషన్లలో కేసులు సైతం నమోదు అయినట్లు తెలిపారు. ఇటీవలే కడప జిల్లాలో పువ్వాడ రమణ అనే ఉద్యోగిపై దాడి జరిగిందని చెప్పారు. ప్రొద్దుటూరు మండలం శ్రీనివాస నగర్ సచివాలయ సెక్రటరీపై దాడి జరిగిందన్నారు. ఇలా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. వీటిని అరికట్టడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని నియమించి పర్యవేక్షించాలని కోరారు. కమిటీకి ప్రత్యేక అధికారాలు కల్పించి దాడులకు పాల్పడే వారిని అరికట్టడానికి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జాబ్‌మేళా రేపు

నగరి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్ మన్ సర్వీసెస్ సెంటర్ చెన్నై వారి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం టెలికాలర్ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ చదువుతున్న వారు ఈ ఉద్యోగానికి అర్హులన్నారు. నెలకు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం, ఉచిత వసతి సదుపాయం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్క్స్ లిస్ట్ జిరాక్స్, ఒరిజినల్ ఐడీ ప్రూఫ్‌తో ఈ నెల 26వ తేదీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు జేకేసీ ఫుల్ టైం మెంటార్ లాల్‌బాషాను గానీ, కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ పార్థసారథిని 9884787264 నంబరుకు, కంపెనీ యూనిట్ హెడ్ ధనరాజ్‌ను 9884304026 నంబరులో సంప్రదించాలన్నారు.

ఓటరు సర్వేకి సహకరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వరస్వామి

పుత్తూరు రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటి సర్వేకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి కోరారు. సోమవారం తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం విడుదల చేసిన ఓటర్ల జాబితాలతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ) ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తారని తెలిపారు. సర్వే సందర్భంగా బీఎల్‌ఓతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన ఆయా బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే 2024 జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఫారం–6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఒక బూత్‌లో 1500 మంది ఓటర్లు మించితే కొత్త బూత్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఓటర్ల తుది జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ తరఫున మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, టీడీపీ రూరల్ పార్టీ అధ్యక్షుడు రవికుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కేశవులు, సీపీఎం సెక్రెటరీ భాస్కర్, సీపీఐ సెక్రెటరీ మహేష్ పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

పాలసముద్రం : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పాలసముద్రం మండలం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున అక్రమంగా ఇసుక, ఎర్రచందనం రవాణా జరిగే అవకాశం ఉందని, అందువల్లపోలీసులు నిఘా పెట్టాలని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు జరిగి పోలీసు కేసులు కాకుండా అన్నదమ్ములుగా కలసి మెలసి ఉండాలని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు తీసుకొచ్చిన వారితో స్నేహభావంతో మెలగి వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా తమిళనాడు సరిహద్దులో ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నా రు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎస్‌ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు పచ్చికాపల్లంలో గడప గడపకు..

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్ల గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కామసాని పద్మనాభరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొంటారని చెప్పారు. పచ్చికాపల్లం సచివాలయ పరిధిలోని ఎర్రగుంట నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అలాగే గ్రామంలోని సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని తెలిపారు. మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన గురుప్రసాద్‌రాజు, శివతో నాయకులు

పాలసముద్రం : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్ తెలిపారు. సోమవారం పాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయడంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనదుర్గాపురం పంచాయతీకి చెందిన బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గురుప్రసాద్, టీడీపీకి చెందిన పాలసముద్రం శివ తమ అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరగా, వీరికి జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, కన్వీనర్ తులసీయాద్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షురాలు ఇందిరమ్మ, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, సర్పంచులు గాలి మహేష్‌బాబు, అయ్యప్ప, లిల్లీ, అనురేఖ, నరసింహరాజు, ఎంపీటీసీ గోవిందరాజు, కుప్పమ్మ, నాయకులు సుందరరాజు, సుబ్రమణ్యరెడ్డి, బాబు, వాసురాజు, ఆనందన్, వరదరాజు, సుబ్రమణ్యం, సుబ్రమణ్యరాజు, అంబేడ్కర్, వేణు, మనోహర్, రవిరెడ్డి, జేసీపీ రవి, నరసింహనాయుడు, వెంకటేష్, సిద్ధమండడి, గోపాల్, చిన్న వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థినుల ఎంపిక



సి. దివిష



వి. ప్రవీణ



జీ. దివ్య



వి. పూజ

సత్యవేడు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 10వతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థినులు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి తెలిపారు. వీరిలో దివిష(574), నూజివీడు, ప్రవీణ(573) ఇడుపులపాయ, జీ.దివ్య(562) ఇడుపులపాయ, వి.పూజ(550) ఒంగోలు ట్రిపుల్ ఐటీ సాంకేతిక కళాశాలకు ఎంపికయ్యారు.

నూతన కార్యవర్గం ఎంపిక

నగరి : మండలంలోని శ్రీవాణి గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో బ్రాహ్మణ సంఘ సమావేశం జరిగింది. ఇందులో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగేంద్ర ప్రసాద్, అధ్యక్షుడిగా ఓరుగంటి బాలసుబ్రమణ్యం, కార్యదర్శిగా వందవాశి శివకుమార్ శర్మ, ఉపాధ్యక్షుడిగా పురాణం నవీన్ కుమార్, కోశాధికారిగా కె.సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మార్గబంధు శర్మ, రాంబట్ల మక్కికుమార్, డి.సురేష్, అర్చకం వాకాటి బాలాజీ, ధర్మగాణి గురు రామచంద్రన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రతినెలా అమావాస్య రోజున సమావేశం నిర్వహిస్తామన్నారు. స్వర్గీయ వందవాశి నరసింహయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన స్థలంలో నూతన భవన నిర్మాణం త్వరగా చేపట్టడానికి చర్యలు చేపడతామన్నారు.

మృతుడు అన్బురెడ్డిగా గుర్తింపు

పుత్తూరు రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ బాత్‌రూమ్‌లో మృతి చెందిన వ్యక్తి పుత్తూరు పట్టణానికి చెందిన అన్బురెడ్డి(45)గా గుర్తించినట్లు సీఐ లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు చెప్పారు.

మహిళా అభివృద్ధే జగనన్న లక్ష్యం



నింద్ర: మహిళలకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నింద్ర: మహిళా అభివృద్ధి కోసం పాటు పడుతున్న ఏకైక వ్యక్తి సీఎం జగనన్నే అని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. సోమవారం నింద్ర సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి అన్ని పథకాలు మహిళలకే పంపిణీ చేయడం గర్వంగా ఉందన్నారు. అమ్మఒడి, ఇంటిపట్టాలు, ఆసరా వంటి పథకాలతో మహిళలను ఆదుకుంటున్న ఘనత సీఎం జగనన్నదే అన్నారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆమె 98 మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు.

14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏం చేశాడు..!

రాష్ట్రానికి 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు తన పాలనలో ఎన్నడైనా అమ్మఒడి, చేయూత, లక్ష మందికి ఇళ్లు ఇచ్చాడా ? అని మంత్రి రోజా ప్రశ్నించారు. నింద్ర మండల కేంద్రంలో ఇళ్లు లేనివారికి 200 ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు. సచివాలయంలో నవరత్నాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఇప్పటివరకు రూ.30 లక్షలతో పనులు కల్పించడం జరిగిందన్నారు. ప్రాచీన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.1.75 కోట్లతో అభివృద్ధికి చేశామని, బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి, ఎంపీడీఓ అరుణ, హౌసింగ్ డీఈ శంకరప్ప, ఏఈ శ్రీధర్ రాజు, తహసీల్దార్ అమరేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, దుర్గాదేవి, సాహిత్య అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ జయశ్రీ, కోఆప్షన్ సభ్యులు అనిల్‌కుమార్, జిల్లా మహిళా కార్యదర్శి మేరీ, ఎంపీటీసీ సభ్యులు విజేష్, ఆర్బీకే డైరెక్టర్ చెంచమ్మ, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సర్పంచ్ వసంతమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, నాయకులు శివలింగ ఆచారి, సుబ్రమణ్యం, శెల్వం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విజయానందరెడ్డి జన్మదిన వేడుకలు



శ్రీరంగరాజపురం: విజయానందరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



జీడీనెల్లూరు: ప్రత్యేక హోమ గెరిగెను ఊరేగింపుగా తీసుకొస్తున్న విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం /గంగాధరనెల్లూరు: ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి జన్మదిన వేడుకలు శ్రీరంగరాజపురం, గంగాధరనెల్లూరు మండలాల్లో ఘనంగా జరిగాయి. ఆయన స్వగ్రామం 49 కొత్తపల్లిమిట్టలో ముందుగా వారి తల్లిదండ్రుల సమాధులకు నివాళులర్పించి, ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌లను కట్ చేసి, ప్రత్యేకంగా రూపొందించిన గజమాలను క్రేన్ సహాయంతో విజయానందరెడ్డిని ఘనంగా సత్కరించారు. వితంతువులకు, దివ్యాంగులకు, వృద్ధులకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు, బోధన ఉపకరణాలు, బ్యాగులు, దుస్తులను అందజేసి అన్నదానం నిర్వహించారు. గంగాధరనెల్లూరులో మండలంలో 100 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయానందరెడ్డి గంగాధరనెల్లూరు గంగమ్మ ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొని మహా కలశాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి వేదపండితులకు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్‌లు డిల్లయ్య, పీసీ సుబ్రమణ్యం, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, సూరిరెడ్డి, సుధ, యుగంధర్, విజయాబాబు, కోటిరెడ్డిబాబు, దేవరాజులురెడ్డి, జనార్దన్, శ్యామ్, దొరస్వామి, గోవిందయ్య, పెద్దిరెడ్డి, సుబ్రమణ్యం, రామచంద్రయ్య, సతీష్, డిల్లీకుమార్ పాల్గొన్నారు.